12-12-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - జ్ఞాన-యోగాలతో పాటుగా మీ నడవడిక కూడా చాలా బాగుండాలి, లోపల ఏ భూతమూ ఉండకూడదు ఎందుకంటే మీరు భూతాలను తొలగించేవారు"

ప్రశ్న:- సుపుత్రులైన పిల్లలకు ఏ నషా స్థిరంగా ఉండగలదు?

జవాబు:- బాబా ద్వారా మేము డబుల్ కిరీటధారులుగా, విశ్వాధిపతులుగా అయ్యే వారసత్వాన్ని తీసుకుంటున్నాము. ఈ నషా సుపుత్రులైన పిల్లలకే స్థిరంగా ఉండగలదు. కానీ కామ-క్రోధాల భూతాలు లోపల ఉన్నట్లయితే ఈ నషా ఉండదు. ఇటువంటి పిల్లలు ఇక తండ్రిపై గౌరవాన్ని కూడా ఉంచలేరు, అందుకే మొదట భూతాలను పారద్రోలాలి. తమ అవస్థను దృఢంగా చేసుకోవాలి.

పాట:- నా మనస్సు అనే ద్వారం వద్దకు ఎవరు వచ్చారు... (కౌన్ ఆయా మేరే మన్ కే ద్వారే...)

ఓం శాంతి. దీని అర్థాన్ని అయితే పిల్లలైన మీరు తప్ప ఇంకెవ్వరూ అర్థం చేసుకోలేరు. అది కూడా నంబరువారు పురుషార్థానుసారంగా అర్థం చేసుకోగలరు, ఎందుకంటే పరమపిత పరమాత్మకు స్థూలమైన లేక సూక్ష్మమైన చిత్రమేమీ లేదు. దేవతలు సూక్ష్మమైనవారు, వారు కేవలం ముగ్గురే ఉన్నారు. వారికన్నా అతి సూక్ష్మమైనవారు పరమాత్మ. ఇప్పుడు - ఓ పరమపిత పరమాత్మా అని ఎవరు అంటారు? ఆత్మ. పరమపిత పరమాత్మను పరమ ఆత్మ అని అంటారు. ఆత్మ లౌకిక తండ్రిని పరమపిత అని అనలేదు. ఎప్పుడైతే పారలౌకిక పరమపిత పరమాత్మను స్మృతి చేస్తారో, అప్పుడు దేహీ-అభిమానులని అంటారు. దేహాభిమానంలో ఉన్నప్పుడు దేహంతో సంబంధము కలిగి ఉన్న తండ్రి గుర్తుకొస్తారు. వీరేమో ఆత్మతో సంబంధము కలిగి ఉన్న తండ్రి. వారు ఇప్పుడు వచ్చి ఉన్నారు. ఆత్మ బుద్ధి ద్వారా తెలుసుకుంటుంది, ఆత్మలోనే బుద్ధి ఉంది కదా. కావున పరమపిత పరమాత్మ తప్పకుండా పారలౌకిక తండ్రి అవుతారు. వారిని ఈశ్వరుడు అని అంటారు. ఇప్పుడు బాబా ఈ ప్రశ్నావళిని తయారుచేసారు. దీని ఆధారంగా పిల్లలైన మీరు అర్థం చేయించడం సహజమవుతుంది. ఏ విధంగా ఫారమ్ ను నింపించడం జరుగుతుందో, అదే విధంగా ప్రశ్నలను కూడా అడగవచ్చు. తప్పకుండా ఎవరైతే అడుగుతారో, వారు నాలెడ్జ్ ఫుల్, అంటే తప్పకుండా వారు టీచరే అవుతారు. ఆత్మయే శరీరాన్ని ధరిస్తుంది మరియు ఇంద్రియాల ద్వారా అర్థం చేయిస్తుంది. కావున పిల్లలు సహజం చేసి అర్థం చేయించేందుకు ఇది తయారుచేయబడింది. కానీ జ్ఞానాన్ని వినిపించే పిల్లల యొక్క అవస్థ కూడా చాలా బాగుండాలి. అయితే కొందరిలో జ్ఞానం బాగుండవచ్చు, యోగము కూడా బాగుండవచ్చు కానీ దానితోపాటుగా నడవడిక కూడా బాగుండాలి. ఎవరిలోనైతే కామ, క్రోధ, లోభ, మోహ, అహంకారమనే భూతాలు ఉండవో, వారిది దైవీ నడవడికగా ఉంటుంది. ఇవి చాలా పెద్ద-పెద్ద భూతాలు. పిల్లలైన మీలో ఏ భూతాలూ ఉండకూడదు. మనము భూతాలను తొలగించేవారము. ఆ అశుద్ధ ఆత్మలేవైతే భ్రమిస్తూ ఉంటాయో, వాటిని భూతాలని అంటారు. ఆ భూతాలను తొలగించేవారు కూడా నిపుణులై ఉంటారు. ఈ పంచ వికారాల రూపీ భూతాలేవైతే ఉన్నాయో, వీటిని పరమపిత పరమాత్మ తప్ప ఇంకెవ్వరూ తొలగించలేరు. సర్వుల భూతాలను తొలగించేవారు ఒక్కరే. సర్వులకు సద్గతినిచ్చేవారు ఒక్కరే. రావణుడి నుండి విముక్తులుగా చేసేవారు కూడా ఒక్కరే. ఇవి పెద్ద భూతాలు. వీరిలో క్రోధమనే భూతము ఉంది, వీరిలో మోహము మరియు అశుద్ధ అహంకారమనే భూతము ఉంది అని అంటూ ఉంటారు కూడా. అందరినీ ఈ భూతాల నుండి విడిపించే ముక్తిప్రదాత, పరమపిత పరమాత్మ ఒక్కరే. ఈ సమయంలో అందరికన్నా శక్తివంతులు ఈ క్రిస్టియన్లు అని మీకు తెలుసు. వారి ఆంగ్ల భాషలోని పదాలు కూడా చాలా బాగున్నాయి. ఏ రాజులు ఉంటే, వారు తమ భాషను నడిపిస్తారు. దేవతల భాష గురించి ఎవరికీ తెలియదు. పూర్వము మన కుమార్తెలు ధ్యానములో నుండి వచ్చి అన్ని విషయాలను తెలియజేసేవారు. 2-4 రోజులు ధ్యానములో ఉండేవారు. అక్కడి భాషను గమనించి వినిపించగలిగే మంచి వివేకము ఉన్న సందేశీలు ఎవరైనా ఇప్పుడు కావాలి.

పిల్లలైన మీరు అందరికీ భారత్ యొక్క కథను వినిపించండి. భారత్ సతోప్రధానముగా ఉండేది, ఇప్పుడు తమోప్రధానముగా, పూజ్యము నుండి పూజారిగా అయిపోయింది. భారత్ లో దేవతల చిత్రాలు ఎన్నో ఉన్నాయి, అంధవిశ్వాసముతో పూజిస్తారు. వారి చరిత్ర గురించి తెలియదు. మనమందరము పాత్రధారులము, కావున డ్రామా యొక్క డైరెక్టర్ మొదలైనవారి గురించి తెలిసి ఉండాలి, అందుకే ప్రశ్నావళిని తయారుచేసారు. పోప్ కు కూడా వ్రాయాలి - ఈ వినాశీ వస్తువులను తయారుచేయడం ఆపు చేయండి అని మీరు అనుచరులకు చెప్తున్నారు, కానీ మీరు చెప్పేది

వీరంతా ఎందుకు వినడం లేదు? మీరైతే అందరికీ గురువు, మీకు ఎంతో మహిమ ఉంది, అయినా కూడా వీరు ఎందుకు వినడం లేదు? మీకు దాని కారణం తెలియదు, మేము మీకు తెలియజేస్తాము. వీరెవ్వరూ మీ మతముపై లేరు, వీరు ఈశ్వరీయ మతముపై తయారుచేస్తున్నారు. స్వర్గ స్థాపన ఆడమ్-ఈవ్ ద్వారా జరుగుతూ ఉంది. భగవంతుడు నాలెడ్జ్ ఫుల్, వారు గుప్తంగా ఉన్నారు. తప్పకుండా వారి సైన్యము వారి మతముపై నడుచుకునేదిగా ఉంటుంది. ఈ-ఈ విధంగా అర్థం చేయించాలి. కానీ పిల్లలు ఇంతటి విశాలబుద్ధి కలవారిగా లేరు, అందుకే స్క్రూ ను టైట్ చేయాల్సి ఉంటుంది. ఏ విధంగానైతే ఇంజన్ చల్లబడిపోతే దానిని వేగవంతం చేయడానికి అందులో బొగ్గును వేస్తారు, అలాగే ఇది కూడా జ్ఞానమనే బొగ్గు. పరమపిత పరమాత్మ అందరికన్నా ఉన్నతమైనవారు, అందరూ వారికి సలామ్ చేయడానికి వస్తారు. పోప్ ను కూడా అందరూ శక్తివంతమైనవారిగా భావిస్తారు. పోప్ కు ఎంతటి గౌరవాన్ని అయితే ఇస్తారో, అంతగా ఇంకెవ్వరికీ ఇవ్వరు. వారికి తండ్రి గురించి తెలియదు. తండ్రి గుప్తంగా ఉన్నారు. వారి గురించి కేవలం పిల్లలకే తెలుసు మరియు వారే పదవిని ఇస్తారు. కానీ మాయ ఎటువంటిదంటే అది పిల్లలను ఇటువంటి తండ్రిపై కూడా గౌరవాన్ని ఉంచనివ్వదు. బాబా విశ్వాధిపతులుగా తయారుచేస్తారు, ఆ నషా బయటకు వెళ్ళడంతోనే సమాప్తమైపోతుంది. మనము బాబా నుండి డబుల్ కిరీటధారులుగా అయ్యే వారసత్వాన్ని ఎందుకు తీసుకోకూడదు, ఇది సుపుత్రులైన పిల్లల యొక్క నషా. కానీ ఎంతోమంది పిల్లలు ఎలా ఉన్నారంటే, వారిలోకి కామ, క్రోధ, లోభాలనే భూతాలు వచ్చేస్తాయి. బాబా మురళి వినిపించేటప్పుడు - ఇప్పటివరకు మాలో ఇంకా కామము యొక్క తేలికపాటి నషా ఉంది అని లోలోపల అనిపిస్తుంది. ఒకవేళ ఒక వైపు దృఢంగా ఉన్నా ఏమీ జరుగదు. కొన్ని చోట్ల స్త్రీలు దృఢంగా ఉంటారు, కొన్ని చోట్ల పురుషులు. బాబా వద్దకు అన్ని రకాల సమాచారాలు వస్తాయి. కొందరు సత్యమైన హృదయంతో వ్రాస్తారు, లోపల-బయట ఎంతో స్వచ్ఛత కావాలి. కొందరు బయటి నుండి సత్యంగా, లోపలి నుండి అసత్యంగా ఉంటారు. తుఫానులైతే అనేకులకు వస్తాయి. బాబా, ఈ రోజు నాకు కామము యొక్క తుఫాను వచ్చింది కానీ రక్షింపబడ్డాను అని వ్రాస్తారు. ఒకవేళ వ్రాయకపోతే - ఒకటేమో శిక్ష పడుతుంది, ఇంకొకటి అలవాటు పెరిగిపోతూ ఉంటుంది. చివరికి పడిపోతారు. బాబాకు పిల్లలపై ఆశలైతే ఉంటాయి కదా. కొద్దిగా గ్రహచారం ఉన్నా కూడా అది తొలగిపోతుంది. కొంతమంది ఎలా ఉన్నారంటే, ఈ రోజు బాగా నడుచుకుంటున్నారు, రేపు మూర్ఛితులైపోతారు లేక గొంతు బిగుసుకుపోతుంది. తప్పకుండా ఏదో అవజ్ఞను చేస్తారు. ప్రతి విషయంలోనూ సత్యంగా ఉండాలి, అప్పుడే సత్యఖండానికి యజమానులుగా అవుతారు. అసత్యం చెప్పినట్లయితే రోగము వృద్ధి చెంది నష్టపరుస్తుంది.

పిల్లలు చాలా యుక్తిగా ప్రశ్నావళిని వ్రాయాలి - పరమపిత పరమాత్మతో మీకు ఏ సంబంధం ఉంది? వారు తండ్రి కావున ఇక సర్వవ్యాపి విషయమే లేదు. వారు సర్వుల సద్గతిదాత, పతిత-పావనుడు, గీతా భగవంతుడు, కావున తప్పకుండా ఎప్పుడో ఒకప్పుడు వచ్చి జ్ఞానాన్ని ఇచ్చి ఉంటారు. ఒకవేళ ఇదే నిజమైతే మరి వారి జీవితగాథ గురించి తెలుసా? తెలియకపోతే వారసత్వము లభించదు. తండ్రి నుండి తప్పకుండా వారసత్వం లభిస్తుంది. తర్వాత రెండవ ప్రశ్న అడగండి - ప్రజాపిత బ్రహ్మా మరియు వారి ముఖవంశావళి గురించి తెలుసా? ఎవరికైతే సరస్వతి అన్న పేరు ఉందో, వారు జ్ఞాన-జ్ఞానేశ్వరి. వారిని జ్ఞానదేవి అని అంటారు, వీరు జగదాంబ, కావున తప్పకుండా వీరికి పిల్లలు కూడా ఉంటారు, తండ్రి కూడా ఉంటారు. జ్ఞానాన్ని ఇచ్చేవారైతే ఆ తండ్రియే. ఇప్పుడు ఈ ప్రజాపిత మరియు జగదాంబ ఎవరు? వారిని ధనలక్ష్మి అని కూడా అంటారు, ఆ సమయములో జ్ఞాన-జ్ఞానేశ్వరిగా ఉండరు. ఈ బ్రహ్మా-సరస్వతులే రాజ-రాజేశ్వరిగా అవుతారు. కావున వారి పిల్లలు కూడా తప్పకుండా స్వర్గాధిపతులుగా అవుతూ ఉండవచ్చు. ఇప్పుడిది సంగమము, కుంభమేళ. ఆ కుంభమేళాలో ఏమి జరుగుతుందో చూడండి, భక్తి మార్గములో చెప్పే అర్థానికి మరియు ఇక్కడి అర్థానికి రాత్రికి-పగలుకు ఉన్నంత తేడా ఉంది. అది నీటి నది మరియు సాగరము యొక్క మేళ. ఇది జ్ఞాన సాగరుడి నుండి వెలువడే మానవ గంగలు యొక్క మేళ. పతితుల నుండి పావనులుగా తయారుచేసేవారు ఎవరు అన్న ప్రశ్నను కూడా అడగడం జరుగుతుంది. ఇవి తెలుసుకోవాల్సిన విషయాలు కదా, అందుకే అడుగుతారు. ఈ మాతా-పితల జ్ఞానం ద్వారా మీరు రాజ-రాజేశ్వరిగా అవ్వగలరు. ఈశ్వరుడు సర్వవ్యాపి అని అనడం వలన నోరు ఏమైనా తీపిగా అవుతుందా? ఇప్పుడు మీకు భక్తికి ఫలంగా జ్ఞానము లభిస్తుంది. ఇప్పుడు భగవంతుడు చదివిస్తారు కావున ఎదురుదెబ్బలు తినడం సమాప్తమైపోతుంది. బాబా అంటారు - పిల్లలూ, అశరీరి భవ. ఆత్మకు జ్ఞానము లభించింది. ఇప్పుడు ఆత్మ అంటుంది - మనము తిరిగి బాబా వద్దకు వెళ్ళాలి అని. ఆ తర్వాత ప్రారబ్ధము లభిస్తుంది. రాజధాని స్థాపనవుతుంది. ఇవి ఎంతగా అర్థం చేసుకోవాల్సిన విషయాలు. ఈ ప్రశ్నావళి చాలా బాగుంది. ఇది అందరి జేబులో ఉండాలి, సేవాధారీ పిల్లలే ఈ విషయాల గురించి ఆలోచిస్తారు. పిల్లల కొరకు బాబా ఎంతగా కష్టపడవలసి ఉంటుంది. బాబా అంటారు - పిల్లలూ, మీ భవిష్యత్తును ఉన్నతంగా చేసుకోండి, లేదంటే కల్ప-కల్పము పదవి తగ్గిపోతుంది. ఏ విధంగా ఈ బాబా మహారాజుగా-మహారాణిగా అవుతారో, అలాగే పిల్లలు కూడా అవ్వాలి. కానీ

స్వయముపై నిశ్చయం ఉండాలి. రాజులో కూడా ఎంతో శక్తి ఉంటుంది. అక్కడైతే సుఖమే సుఖముంటుంది. మరియు ఎవరైతే రాజులుగా అవుతారో, వారు కూడా ఈశ్వరార్థము దాన-పుణ్యాదులు చేయడం ద్వారా అలా అవుతారు. రాజు ఆజ్ఞానుసారంగా ప్రజలంతా నడుస్తారు. ఈ సమయంలో భారతవాసులకు రాజు ఎవరూ లేరు, పంచాయతీ రాజ్యం ఉంది, కావున ఎంత బలహీనంగా అయిపోయారు.

బాబాకు తెలుసు - చాలామంది పిల్లలకు తుఫానులు వస్తాయి కానీ సమాచారాన్ని ఇవ్వరు. ఇటువంటి తుఫానులు వస్తున్నాయి, మీరు సలహాను ఇవ్వండి అని బాబాకు వ్రాయాలి. బాబా పరిస్థితిని చూసి సలహాను ఇస్తారు. కానీ వారూ బాబాకు వ్రాయరు, అలాగే వారి తోటివారు కూడా - బాబా, మా సహచరుని పరిస్థితి ఇలా ఉంది అన్న సమాచారాన్ని ఇవ్వరు. బాబాకైతే సమాచారాన్ని ఇవ్వాలి. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

రాత్రి క్లాస్ **11-1-69**

అనంతమైన తండ్రి వచ్చి అర్థం చేయిస్తారు, తమవారిగా చేసుకుంటారు, రాజ్యపదవి కొరకు శిక్షణను ఇస్తారు, పవిత్రంగా కూడా తయారుచేస్తారు. తండ్రి చాలా సహజమైన రీతిలో తమ మరియు వారసత్వము యొక్క పరిచయాన్ని అర్థం చేయిస్తారు. ఇది తమకు తాముగా అర్థం చేసుకోలేరు. అనంతమైన తండ్రి నుండి తప్పకుండా అనంతమైన వారసత్వం లభిస్తుంది - ఇది కూడా మంచి వివేకవంతులే అర్థం చేసుకుంటారు. తండ్రి ఏ వారసత్వాన్ని ఇస్తారు? ఇల్లు, చదువు మరియు స్వర్గ రాజ్యాధికారము యొక్క వారసత్వాన్ని ఇస్తారు. ఎవరైతే పవిత్రమైన దైవీ సాంప్రదాయులుగా అవుతారో, వారే రాజధానిలోకి వస్తారు. ఎవరు ఎంతగా చదువుతారో, చదివిస్తారో వారే ఉన్నత పదవిని పొందుతారు. ఎంతోమంది పిల్లలు ఉన్నారు, తండ్రి నుండి వారసత్వాన్ని తీసుకుంటారు. తండ్రి స్వర్గానికి యజమానిగా, నరుని నుండి నారాయణునిగా తయారుచేస్తారు. వీరు రాజ్యానికి అధిపతి. కావున అనంతమైన తండ్రి ఎవరైతే స్వర్గ రచయితనో వారి పిల్లలమైన మనము స్వర్గ రాజ్యాధికారాన్ని తీసుకుంటాము, యథా రాజా రాణి తథా ప్రజా... ఎంత పురుషార్థము చేస్తే, అంత ఉన్నత పదవిని పొందుతారు. ఇది రాజ్యం కొరకు చేసే పురుషార్థము. సత్యయుగ రాజ్యము అందరికీ లభించదు. ఎవరు ఎంతగా పురుషార్థం చేస్తారో, అంతగానే ఉన్నత పదవిని పొందుతారు. పురుషార్థంపైనే ప్రారబ్ధము ఆధారపడి ఉంటుంది. ఎంత పురుషార్థం చేస్తే అంత ఉన్నత పదవి లభిస్తుందని అయితే పిల్లలకు తెలుసు. పురుషార్థము ద్వారానే రాజ్యము లభిస్తుంది. స్వయాన్ని ఆత్మగా భావించి తండ్రిని స్మృతి చేసినట్లయితే తమోప్రధానుల నుండి సతోప్రధానులుగా, స్వచ్ఛమైన బంగారముగా అయిపోతారు. రాజ్యము కూడా లభిస్తుంది. ఏ విధంగానైతే ఇక్కడ భారత్ కు మేము యజమానులము అని అంటారు. యజమానులుగా అయితే అందరూ అవుతారు. మరి ఏ పదవిని పొందుతారు? చదువుకున్న తర్వాత స్వర్గములో మనకు ఏ పదవి ఉంటుంది? మీరిప్పుడు సంగమములో చదువుతారు, సత్యయుగములో రాజ్యం చేస్తారు. తండ్రి యోగము కూడా నేర్పిస్తారు, అలాగే చదివిస్తారు కూడా. మేము రాజయోగాన్ని నేర్చుకుంటున్నాము అని మీరు భావిస్తారు. తండ్రి స్మృతితో పావనులుగా కూడా అవుతారు. ఆ తర్వాత మన పునర్జన్మలు రావణ రాజ్యములో కాదు, రామ రాజ్యములో ఉంటాయి. ఇప్పుడు మనము - మన్మనాభవ, మధ్యాజీభవ అన్నది చదువుకుంటున్నాము. ఇప్పుడు ఇది కలియుగాంతము, తర్వాత సత్యయుగమైన స్వర్గము తప్పకుండా వస్తుంది. తండ్రి సంగమయుగములోనే వచ్చి అనంతమైన స్కూలును తెరుస్తారు, అక్కడ అనంతమైన రాజ్యాధికారాన్ని పొందేందుకు అనంతమైన చదువు ఉంది. ఇప్పుడు మనం కొత్త ప్రపంచానికి యజమానులుగా అవుతామని మీకు తెలుసు. కొత్త ప్రపంచాన్ని స్వర్గము అని అంటారు, నషా ఎక్కుతుంది కదా. తప్పకుండా పాత ప్రపంచం తర్వాత కొత్త ప్రపంచం ఉంటుంది. పిల్లలకు గుర్తుకొస్తుంది. స్వర్గాధిపతులుగా తయారుచేయడానికి మమ్మల్ని పరమపిత పరమాత్మ చదివిస్తున్నారని - పిల్లలందరి హృదయంలోను ఉంది. మమ్మల్ని భగవంతుడు చదివిస్తున్నారని, ఉన్నతోన్నతమైన సత్యయుగానికి రాజు-రాణిగా అవుతారని పిల్లలకు గుర్తుండాలి. రాజయోగము ద్వారా రాజ్యము లభిస్తుంది, అందులో పవిత్రత, సుఖము, శాంతి అన్నీ ఉంటాయి. ఈ బాబాలో ఇప్పుడు శివబాబా విచ్చేసి ఉన్నారు. వారు ఉన్నతోన్నతమైనవారు. ఆత్మ అనుభవాన్ని తీసుకుంటూ ఉంటుంది. అక్కడకు వెళ్ళినప్పుడు అక్కడ కూర్చునే విధానము ఉన్నతంగా ఉంటుంది. విద్యార్థులందరి కూర్చునే విధానము ఎవరిది వారిది ఉంటుంది. ఒకరి స్థానములో ఇంకొకరు కూర్చోలేరు. ఒకరి పాత్ర మరొకరితో కలవదు. ఆత్మలో రికార్డు నిండి ఉంది అని తండ్రి అర్థం చేయించారు. డ్రామా ప్లాన్ అనుసారంగా మన పురుషార్థము నడుస్తుంది, కొందరు రాజులుగా, కొందరు రాణులుగా

అవుతారు. అంతిమములో పురుషార్థము యొక్క రిజల్టు వెలువడుతుంది, అప్పుడు మాల తయారవుతుంది. ఉన్నతమైన నంబరులో ఉన్నవారికి తప్పకుండా తెలుస్తుంది. ఆత్మ వెళ్ళి కర్మల అనుసారంగా మరొక శరీరాన్ని తీసుకుంటుందని మరణించిన తర్వాత అర్థం చేసుకోవడం జరుగుతుంది. మంచి కర్మలు చేసినవారికి యోగబలం ద్వారా మంచి జన్మ లభిస్తుంది. పురుషార్థం చేయకపోతే తక్కువ పదవిని పొందుతారు. ఈ-ఈ విధంగా ఆలోచించడం ద్వారా సంతోషం కలుగుతుంది. ఎవరు ఎటువంటి మహారథులో, వారికి అటువంటి మహిమ ఉంటుంది. మురళీ కూడా అందరిదీ ఒకే విధంగా నడవదు. ప్రతి ఒక్కరి మురళీ కూడా వేరు-వేరుగా ఉంటుంది. ఇది తయారై-తయారుచేయబడిన ఆట కదా. ఇప్పుడు పిల్లలకు కర్మలపై ధ్యాస ఉంది. తల్లి-తండ్రులు ఏ విధంగా చేస్తే, పిల్లలు అదే విధంగా నేర్చుకుంటారు. ఇప్పుడు మీరు శ్రేష్ఠ కర్మలు చేస్తారు. సేవ ద్వారా తెలుస్తుంది, మహారథుల శ్రమ దాగి ఉండదు. ఎవరు ఉన్నత పదవిని పొందేందుకు శ్రమ చేస్తున్నారనేది అర్థం చేసుకోవచ్చు. పిల్లలందరికీ అవకాశము కూడా ఉంది. ఉన్నత పదవిని పొందేందుకు మన్మనాభవ అనే పాఠము అర్థ సహితంగా లభించి ఉంది. ఈ గీతా జ్ఞానాన్ని నాలెడ్జ్ ఫుల్ అయిన తండ్రి స్వయంగా వచ్చి ఇస్తారు కావున తప్పకుండా ఏక్యురేట్ జ్ఞానాన్నే ఇస్తారని పిల్లలు అర్థం చేసుకుంటారు. ఆ తర్వాత ధారణపై ఆధారపడి ఉంటుంది, ఏదైతే వింటారో అది ప్రాక్టికల్ లోకి వస్తూ ఉండాలి. ఇది కష్టమేమీ కాదు. తండ్రిని స్మృతి చేయాలి మరియు చక్రాన్ని తెలుసుకోవాలి. ఇది అంతిమ జన్మ యొక్క చదువు, ఇది పాస్ అయ్యి కొత్త ప్రపంచమైన సత్యయుగములోకి వెళ్ళిపోతారు.

నిశ్చయములోనే విజయము అన్న గాయనం ఉంది. మమ్మల్ని భగవంతుడు చదివిస్తున్నారు అని - ప్రీతిబుద్ధి కల పిల్లలు అర్థం చేసుకున్నారు. మా ఆత్మ ధారణ చేస్తుంది - అని పిల్లలకు తెలుసు. ఆత్మ ఈ శరీరం ద్వారా చదువుతుంది, ఉద్యోగం చేస్తుంది, ఇవి అర్థం చేసుకోవాల్సిన విషయాలు. తండ్రిని స్మృతి చేస్తారు, తర్వాత మాయా రావణుడు బుద్ధి యోగాన్ని తెంచేస్తాడు, మాయ విషయములో జాగ్రత్తగా ఉండాలి. ఎంతగా ముందుకు వెళ్తారో, అంతగా మీ ప్రభావం కూడా వెలువడుతుంది మరియు సంతోషపు పాదరసం కూడా పైకెక్కుతుంది. కొత్త జన్మను తీసుకుంటే ఎంతగానో ప్రత్యక్షం చేస్తారు.

అచ్ఛా! మధురాతి-మధురమైన ఆత్మిక పిల్లలకు ఆత్మిక బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ నైట్.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. లోపల-బయట స్వచ్ఛముగా ఉండాలి. సత్యమైన హృదయముతో తండ్రికి తమ సమాచారాన్ని ఇవ్వాలి. ఏదీ దాచిపెట్టకూడదు.

2. ఇప్పుడిక తిరిగి వెళ్ళాలి, అందుకే అశరీరిగా అయ్యే అభ్యాసము చేయాలి, మౌనముగా ఉండాలి.

వరదానము:- నాది అన్న దానిని నీదిలోకి పరివర్తన చేసి ఎగిరే కళను అనుభవం చేసే డబుల్ లైట్ భవ

ఈ వినాశీ తనువు మరియు ధనము, పురాతనమైన మనస్సు నావి కావు, వాటిని తండ్రికి ఇచ్చేసాను. మొదటి సంకల్పమే - సర్వస్వము మీదే... అని చేసారు. ఇందులో తండ్రికి లాభమేమీ లేదు, మీకే లాభముంది ఎందుకంటే నాది అని అనడం వలన చిక్కుకుపోతారు మరియు నీది అని అనడం వలన అతీతముగా అవుతారు. నాది అని అనడం వలన భారం కలవారిగా అవుతారు మరియు నీది అని అనడం వలన డబుల్ లైట్ గా, ట్రస్టీలుగా అవుతారు. ఎప్పటివరకైతే ఎవరైనా తేలికగా అవ్వరో, అప్పటివరకు ఉన్నతమైన స్థితికి చేరుకోలేరు. తేలికగా ఉండేవారే ఎగిరే కళ ద్వారా ఆనందాన్ని అనుభూతి చేస్తారు. తేలికగా ఉండడములోనే సంతోషము ఉంది.

స్లోగన్:- ఎవరిపైనైతే ఏ వ్యక్తి లేక పకృతి తమ ప్రభావాన్ని చూపించలేవో, వారే శక్తిశాలి ఆత్మ.